కమ్యూనిటీ హాల్స్ ప్రారంభమెప్పుడో?

- మిర్యాలగూడలో రూ.3 కోట్లతో భవనాల నిర్మాణం
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం
- పనులు పూర్తి చేయాలని కోరుతున్న ప్రజా సంఘాల నాయకులు


మహాత్మాజ్యోతిరావు పూలే (బీసీ) భవనం


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ (ఎస్సీ) భవనం

మిర్యాలగూడ టౌన్ : ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన వారు సభలు, సమావేశాలను నిర్వహించుకునేందుకు ప్రభుత్వం తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) (టీయూఎఫ్ఐడీసీ) పథకం ద్వారా రూ.3కోట్ల వ్యయంతో మూడు కమ్యూనిటీ భవన నిర్మాణాలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. కానీ ఆ కమ్యూనిటీ భవనాల్లో పెండింగ్ పనులు ఉండటంతో ప్రారంభించడానికి నోచుకోకుండా ఉన్నాయి. ఈ మూడు భవనాలకు ఎలాంటి ప్రహరీ లేకపోవడంతో అర్ధరాత్రి వరకు అసాంఘిక కార్యకలాపాలకు పూర్తిగా అడ్డగా మారిందనే ప్రచారం సాగుతోంది. ఎన్ఎస్‌పీలో మున్సిపల్ కార్యాలయం వెనుక భాగంలో మహాత్మా జ్యోతిరావ్ పూలే(బీసీ), సంత్ సేవాలాల్(ఎస్టీ), భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ (ఎస్సీ) భవనాలను నిర్మించింది. ఈ భవన నిర్మాణాలకు 2019 జూలై 12న స్థానిక ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ఆధ్వర్యంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి శంకు స్థాపన చేశారు. ఏడాదిలోనే భవన నిర్మాణాలు పూర్తి అయినప్పటికీ అంసపూర్తిగా ఉన్న చిన్న చిన్న పనులతో పాటు ప్రహరీ నిర్మాణం పూర్తి చేసేందుకు అధికారులు ఆలసత్వం వహిస్తుండటంతో అవి నేటికి నిరుపయోగంగా మారాయి. ఈ భవనాల్లో అర్ధరాత్రి సమయం వరకు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారుతుండటంతో అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ప్రారంభించే విధంగా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

90శాతం పనులు పూర్తి..

రాష్ట్ర ప్రభుత్వం మహనీయుల పేర్లతో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతిరావ్‌పూలే, శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ పేర్లతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఒక్కొక్క కమ్యూనిటీ భవన నిర్మాణాలను రూ. కోటీతో చేపట్టింది. కాగా ఎస్టీ, బీసీ కమ్యూనీటి భవనాలను మున్సిపల్ శాఖ, ఎస్సీ కమ్యూనిటీ భవన నిర్మాణాన్ని పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ భవన నిర్మాణాలకు కేటాయించిన నిధులతో 90శాతం వరకు పనులు పూర్తి చేయగా మరో 10శాతం పనులు మాత్రమే మిగిలి ఉండగా గత ఏడాదిన్నర నుంచి నిరుపయోగంగా ఉండటంతో వాటి చుట్టు పిచ్చిమొక్కలు పెరిగిపోతున్నాయి. త్వరగా పనులు పూర్తి చేసి భవనాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు.

పనులు పూర్తి కాగానే ప్రారంభిస్తాం



కమ్యూనిటీ భవనాల నిర్మాణ పనులు కొంత వరకు పెండింగ్‌లో ఉన్నందున వాటిని పూర్తి చేసిన తరువాత ప్రారంభించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. కమ్యూనిటీ భవనాల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం లేకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతాం.

– పూర్ణచందర్, మున్సిపల్ కమిషనర్, మిర్యాలగూడ

పేదింటి ఆడబిడ్డలకు కొండంత భరోసా

- ఎమ్మెల్యే రవీంద్రకుమార్


కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

దేవరకొండ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా పేదింటి ఆడబిడ్డలకు ప్రభుత్వం కొండంత భరోసా కల్పింస్తుందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. శనివారం దేవరకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొండమల్లేపల్లి మండలానికి చెందిన 36మంది లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. మహిళా సంక్షేమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తూ పెద్దపీట వేస్తుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నట్లు ఆయన గుర్తుచేశారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల ద్వారా పేదింటి ఆడబిడ్డల వివాహానికి ప్రభుత్వం రూ.1లక్ష అందిస్తుందని ఆయన తెలిపారు. సంక్షేమ పథకాల అమల్లో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కుంభం శ్రీనివాస్‌గౌడ్,కేసాని లింగారెడ్డి, పస్నూరి యుగేంధర్‌రెడ్డి, మేకల శ్రీనివాస్‌యాదవ్, నేనావత్ రాంబాబు, శంకర్, బొడ్డుపల్లి కృష్ణ పాల్గొన్నారు.

డబుల్‌రోడ్డు మంజూరు చేయాలి


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భగత్

తిరుమలగిరి(నాగార్జునసాగర్): నూతనంగా ఏర్పడిన తిరుమలగిరి మండల కేంద్రానికి డబుల్ రోడ్డు సౌకర్యం లేకపోవడంతో మండల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని మండల కేంద్రానికి డబుల్ రోడ్డునే ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే నోముల భగత్ అసెంబ్లీ ప్రశ్నోత్తరా సమయంలో సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తిరులమగిరి మండలంలో అధికంగా గిరిజనులు, గిరిజన తండాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని సంబంధిత శాఖ మంత్రి ఎమ్మెల్యే ప్రశ్నకు బదులిచ్చారు.

‘పీఎం స్వానిధి సే సమృద్ధి’పై అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న మెప్మా పీడీ కరుణాకర్

మిర్యాలగూడ టౌన్ : పీఎం స్వా నిధి సే సమృద్ధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ కరుణాకర్ అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ని రైతు వేదికలో లేబర్, ఐసీడీఎస్, రెవెన్యూ, అర్బన్ హెల్త్, మెప్మా ఆర్పీలు, బ్యాంకు అధికారులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఈ ఏడాది మున్సిపాలిటీలో 3428 మంది స్ట్రీట్‌వెండర్స్‌లను గుర్తిం లన్నారు. మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్ మాట్లాడుతూ సిటిజన్ ఫీడ్ బ్యాక్ విషయంలో పట్టణం వెనుకంజలో ఉందని, ఈ వారంలో సీటిజన్ ఫీడ్‌బ్యాక్‌లో మనే ముందుండాలన్నారు. అదే విధంగా హారిహారం కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేయాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని ప్రతి ఇంటిలో మొక్కలను నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా డీసీఎం శివాజీనాయక్, మిర్యాలగూడ అర్బన్ సీడీపీఓ మమత, సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ జావిద్, లేబర్ డిపార్ట్‌మెంటు సుధాకర్‌రెడ్డి, బ్యాంకు అధికారులు లోకేష్, కోటేశ్వర్‌రావు, కన్నదాసన్, సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

నేడు రజక వృత్తిదారుల బంద్

హాలియా : తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం రజక కులవృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో నేడు (ఆదివారం) హాలియా పట్టణంలో నిర్వహించనున్న బంద్‌లో కులవృత్తిదారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఎడారి నరేష్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన స్థానిక నాయకులతో కలిసి బంద్ కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. హాలియా పట్టణంలో కులవృత్తి ద్వారా జీవనోపాధి పొందుతున్న రజక కులవృత్తిదారులు తమ లాండ్రీ షాపులు, మహిళల కులవృత్తిని బంద్ చేసి ఆదివారం ఉదయం 10 గంటలకు బస్టాండ్ ఎదురుగా నిర్వహంచే కార్యక్రమంలో పాల్గొన్నాలన్నారు. ఈ కార్యక్రమంలో రజక కులవృత్తిదారుల సంఘం మండల అధ్యక్షుడు నారాయణదాసు అంజయ్య, పట్టణ అధ్యక్షుడు జూపల్లి కృష్ణ, నాయకులు జూపల్లి కోటేష్, రేబెల్లి వెంకటయ్య, దాచేపల్లి శ్రీను, టేకు శ్రీను, ఖమ్మంపాటి దానయ్య, గోలి శంకర్, సతీష్, అనుముల మహేష్, అనుముల అనిల్, నరేష్, మహిళా వృత్తి నాయకురాలు అనుముల లింగమ్మ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న తల్లిపాల వారోత్సవాలు


దేవరకొండ : అవగాహన సమావేశంలో పాల్గొన్న అంగన్‌వాడీలు


హాలియాలో మాట్లాడుతున్న సీడీపీఓ గంధం పద్మావతి

దేవరకొండ : తల్లిపాల ప్రాముఖ్యతపై గర్భిణులు, బాలింతలకు క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కల్పించాలని దేవరకొండ ఇన్‌ఛార్జ్ సీడీపీఓ ఖతీజాబేగం అన్నారు. శనివారం దేవరకొండలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈనెల 7వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీఓ భాగ్యమ్మ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు ఉన్నారు.

మిర్యాలగూడ టౌన్ : ఆరోగ్యలక్ష్మి పథకం ద్వారా అంగన్‌వాడీ కేంద్రం ద్వారా గర్భిణులకు భోజనం అందించాలని మిర్యాలగూడ అర్బన్ సీడీపీఓ మమత అన్నారు. శనివారం పట్టణంలోని వాసవి భవనంలో అంగన్‌వాడీ టీచర్లు, ఎస్ఏఎం,ఎంఏఎం పిల్లల గురించి నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని తల్లిపాల ప్రాముఖ్యత, గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారంపై వివరించారు. అదే విధంగా ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఏఎన్సీ చెకప్‌లు జరుగుతాయని, వారికి ఆరోగ్యలక్ష్మి పథకంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం అందించాలన్నారు. ఎస్ఏఎం పిల్లలో ఉన్న పిల్లలకు బాలామృతం ప్లస్, అందించాలని, వారికి ఆకలి పరీక్ష అంగన్‌వాడీ టీచర్లు చేయాలని వివరించారు. తక్కువ బరువు, కురచదనం, బక్కపలచదనం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రేవతి, రాధిక, పద్మ, సుశీల, నజిమా, మాధవి, లీలకుమారీ, బ్లాక్ కో ఆర్డినేటర్ కవితతో పాటు అంగన్‌వాడీ టీచర్లు తదితరులున్నారు.

అమ్మపాలు.. బిడ్డకు అమృతం

మిర్యాలగూడ టౌన్ : తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివి అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి. రేవతి అన్నారు. శనివారం పట్టణంలోని గాంధీనగర్ సెక్టార్ పరిధిలో గల గాంధీనగర్–2 అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముర్రుపాలతో పిల్లలకు వ్యాధినిరోధక శక్తి మరింత పెరుగుతుందన్నారు. పిల్లలకు ఆరు నెలల పాటు తల్లిపాలను పట్టించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సైదమ్మ, భారతి, వాణి, ఎల్లమ్మలతో పాటు ఆయాలు, ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు, బాలింతలు, గర్భిణులు ఉన్నారు.

హాలియా : పట్టిన ప్రతీ బిడ్డకూ వెంటనే ముర్రుపాలు తాపించాలని సీడీపీఓ గంధం పద్మావతి అన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు అనుముల ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శనివారం అనుముల మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ సువర్ణ, సూపర్‌వైజర్స్ వెంకాయమ్మ, రమాదేవీ, సైదాబేగం, గౌసియాబేగం, సరిత, రాజేశ్వరీ, నాగమణి, యాదమ్మ, విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని రెండో సెంటర్‌లో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. చింతకుంట్ల ఉప సర్పంచ్ ఏకుల సురేష్ మాట్లాడుతూ శిశువులకు ఆరు మాసాల వరకు తల్లిపాలు మాత్రమే తాగించాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లు గర్భవతులు, బాలింతలకు తల్లిపాల ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

దేవరకొండ : రానున్న సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి ఖాలీద్‌అహ్మద్ అన్నారు. శనివారం దేవరకొండ మండలం గొట్టిముక్కల గ్రామంలో నిర్వహించిన ‘ఇంటింటికి కాంగ్రెస్’ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు కొర్ర రాంసింగ్‌నాయక్, కిన్నెర హరికృష్ణ, సర్పంచ్ అయ్యన్న, రమేష్‌నాయక్, ముకురోజు రాజు,సతీష్, రామస్వామి, వెంకటయ్య, జంగయ్య, నాగార్జున పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణాలు పూర్తి చేయాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ గార్లపాటి జ్యోతిలక్ష్మి

మిర్యాలగూడ టౌన్ : గ్రామ పంచాయతీల్లో చేపట్టిన తెలంగాణ క్రీడా ప్రాంగణాలను ఈనెల 8వ తేదీ వరకు పూర్తి చేయాలని ఎంపీడీఓ గార్లపాటి జ్యోతిలక్ష్మి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన గ్రామ పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆమె మాట్లాడారు. క్రీడా ప్రాంగణాలను గ్రామాల్లో పూర్తి చేసి క్రీడాకారులను తయారు చేసేందుకు ఉపయోగించాలన్నారు. అదే విధంగా ఆవాస గ్రామాల్లో కూడా ఈ నెల 14 వరకు పూర్తి చేయాలన్నారు. హరిత హారం కింద నాటిన ప్రతి మొక్కను సంరక్షించుకునే బాధ్యత కూడా ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఇళ్లలో నీటి నిల్వ లేకుండా చేసుకోవాలని, డెంగీ జ్వరాలు రాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. రోజువారిగా తాత్కాలిక పారిశుద్ధ్య సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని అదేశించారు. ఈ సమావేశంలో ఎంపీవో విరారెడ్డితో పాటు కార్యాలయ సిబ్బంది తదితరులున్నారు.

గోపి కుటుంబానికి న్యాయం చేయాలని ధర్నా


విజయపురి టౌన్ పోలీసు స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న మృతుడి బంధువులు, కుటుంబ సభ్యులు

నాగార్జునసాగర్ : విద్యుదాఘాతంతో మృతిచెందిన జూనియర్ లైన్‌మెన్ వాంకుడోతు గోపి కుటుంబానికి న్యాయం చేయాలని విజయపురి టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట మృతుడి బంధువులు, కుటుంబ సభ్యులు శనివారం ధర్నా చేపట్టారు. పెద్దవూర మండల పర్వేదుల సబ్ స్టేషన్ పరిధిలో జయరాం తండాలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేస్తుండగా ఒక ఫీడర్‌కు బదులు మరో ఫీడర్‌కు ఎల్‌సీ ఇచ్చిన లైన్‌ఇన్‌స్పెక్టర్, ఏఈ, డీఈలను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విధులు నిర్వహిస్తూ మరణించిన గోపి కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగం ఇవ్వడంతో పాటు వారి కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం ఎస్ఐ సంపత్ వారికి నచ్చజెప్పి ధర్నాను విరమింపజేశారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు


తిరుమలగిరి(సాగర్)లో అరెస్టయిన ఎన్ఎస్‌యూఐ నాయకులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మేరావత్ ముని నాయక్ అన్నారు. ఈనెల 28,29 తేదిల్లో జరిగే గ్రూప్- 2 పరీక్షను వాయిదా వేయాలని కోరుతూ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడికి బయలు దేరిన యూత్ కాంగ్రెస్ నాయకులను శనివారం అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంజి, సాయి, నాయకులు హరి నాయక్, శివ, హనుమంతు, ఉన్నారు.

ఎన్ఎస్‌యూఐ కార్యకర్తల ముందస్తు అరెస్ట్

అడవిదేవులపల్లి : టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజ్ గ్రూఫ్–2 పరీక్ష రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు బల్మూరి వెంకట్ అదేశాల మేరకు అసెంబ్లీ ముట్టడికి శనివారం బయలుదేరుతున్న ఎన్ఎస్‌యూఐ నాయకులను ముందస్తుగానే అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీస్ హెడ్‌కానిస్టేబుల్ జిలాని, పోలేపల్లి అంజిల ఆధ్వర్యంలో నాయకులు మండల అధ్యక్షులు హనుమయ్య, శ్రీకాంత్, సైదయ్య ఉన్నారు.

నిడమనూరు : ఎన్ఎస్‌యూఐ చేపట్టిన అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా నిడమనూరుకు చెందిన యూత్‌కాంగ్రెస్ నాయకులను శనివారం ఉదయమే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గ్రూప్–2 పరీక్షను వాయిదా వేయాలని కోరుతూ ఎన్ఎస్‌యూఐ అసెంబ్లీ ముట్టడికి పిలుపు ఇచ్చింది. ముందస్తు అరెస్ట్ అయిన వారిలో నిడమనూరు టౌన్ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ కల్లు పురుషోత్తం రెడ్డి, యూత్ నాయకులు అజ్మత్, శ్యామ్, ప్రసాద్, చిత్రం దిలీప్, దినకర్, షేక్ ఇబ్రహీం ఉన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఎమ్మెల్యేపై ఆరోపణలు

పెద్దవూర : నియోజకవర్గ అభివృద్ధిని చూసి ఓర్వలేకనే కొంత మంది కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే నోముల భగత్‌పై ఆరోపణలు చేస్తున్నారని మండల పార్టీ అధ్యక్షుడు రవి నాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని నిమ్మనాయక్‌తండా గ్రామపంచాయతీని రెండుగా చేస్తే అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే భగత్ మంత్రి దృష్టికి తీసుకెళ్తే అది గిట్టక కొంత మంది కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేపై అవాస్తవమైన ఆరోపణలు చేయడం తగదన్నారు. మండలంలో పోడుభూముల పట్టాలు పార్టీలకు అతీతంగా అందించినట్లు ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు కేతావత్ బిక్షా నాయక్, బాలాజీ, నాగయ్య, శివాజీ, శ్రీకర్, మల్లిఖార్జున్, రాజేష్, కిషన్, శంకర్, బాలవర్థిరాజు, గోపి తదితరులు పాల్గొన్నారు.


ఆర్టీసీ బిల్లుకు గవర్నర్ ఆమోదం తెలపాలి


మిర్యాలగూడ టౌన్ : డిపో ఎదుట ధర్నా చేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

దేవరకొండ : ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం బిల్లుకు రాష్ట్ర గవర్నర్ ఆమోదం తెలపాలని తెలంగాణ మజ్దూర్ యూనియన్(టీఎంయూ) దేవరకొండ డిపో కార్యదర్శి ఓరుగంటి రమేష్‌గౌడ్ కోరారు. టీఎంయూ ఆధ్వర్యంలో శనివారం ఉదయం కార్మికులు డిపో ఎదుట బైఠాయించి ధర్నాకు దిగడంతో రెండు గంటల పాటు బస్సులు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని బిల్లుకు ఆమోదం తెలపాలన్నారు. ఈ కార్యక్రమం లో రాజేందర్, సమద్, లక్పతి, నందు, యాదమ్మ, అంజి, షౌకత్ పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్ : ప్రభుత్వంలో ఆర్టీసీ వీలినం బిల్లును గవర్నర్ ఆమోదించకపోవడాన్ని నిరసిస్తూ శనివారం టీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట నల్ల బ్యాడ్జీలను ధరించి ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎక్బాల్, హనుమంతు, కళ్యాణ్‌లు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల పోరాటల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో వీలినం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు టీఎస్‌రెడ్డి, గోపయ్య, రాములయ్య, వి. సత్యనారాయణ, హరిత, నారాయణమ్మ, అనిత, నాగలక్ష్మి, మల్లికాంబ, శారథ, అశోక్‌కుమార్, ఎంఏ కుమార్, బాల, రమేష్, సతీష్, శ్రీకాంత్ తదితరులున్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

దేవరకొండ : దేవరకొండ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 1997–98కి చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థిగా ఉన్న సమయంలో తమ అనుభవాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, తదితరులున్నారు.

సంక్షిప్త సమాచారం

16 వరకు ఓపెన్ యూనివర్సిటీ అడ్మిషన్లకు గడువు

మిర్యాలగూడ అర్బన్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శిటీ అడ్మిషన్లకు ఈ నెల 16వ తేదీ వరకు గడువు ఉందని కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ సర్బింగ్ కోటయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్లు పూర్తిగా ఆన్‌లైన్ ద్వార జరుగుతాయని వివరాల కోసం 7382929640 ను సంప్రదించాలని సూచించారు. అదే విధంగా రెండవ, మూడవ సంవత్సరం విద్యార్థులకు రిజిస్ట్రేషన్, ట్యూషన్ ఫీజ్ తేదీ గడువును కూడా ఈ నెల 16వ తేదీ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు.

నేడు భవన నిర్మాణ కార్మికులకు ఉచిత వైద్యపరీక్షలు

మాడుగులపల్లి : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ) హెల్త్ కేర్ ఆధ్వర్యంలో కార్మికశాఖ గుర్తింపుకార్డు కలిగిన భవన నిర్మాణ కార్మికులకు నేడు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రక్త, మూత్ర, షుగర్, థైరాయిడ్, హెచ్‌బీ1సీ, హెచ్ఐవీ, కిడ్నీ, లివర్ ఫంక్షన్ తదితర సాధారణ వైద్య పరీక్షలను ఉచితంగా చేయనున్నట్లు పేర్కొన్నారు.

మహిళలకు అండగా షీటీం

మిర్యాలగూడ అర్బన్ : మహిళలు, విద్యార్థినులకు అండగా షీ టీం పని చేస్తుందని ఏఎస్ఐ తబిత అన్నారు. శనివారం షీ టీం ఆధ్వర్యంలో పట్టణంలోని శివాని హైస్కూల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ షరీఫ్, సిబ్బంది మారయ్య, బిక్షం శివాని హైస్కూల్ చైర్మన్ కుందూరు శ్యాంసుందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కె.వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

గుణాత్మక విద్య అందించాలి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): ఉపాధ్యాయులు విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను అందించాలని ఎఫ్ఎల్ఎన్ మండల నోడల్ అధికారి సైదా నాయక్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న తొలిమెట్టు (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమంలో భాగంగా శనివారం గణితంపై ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, కాంప్లెక్స్ హెచ్ఎం పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుడికి నివాళి

త్రిపురారం : మండలంలోని బెజ్జికల్ గ్రామ పంచాయతీ కార్మికుడిగా పేరుపంగ వెంకటేశ్వర్లు శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో స్థానికులతో సమాచారం తెలుసుకున్న నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్లచంద్రా రెడ్డి మృతుడు వెంకటేశ్వర్లు ఇంటికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 5 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొటి రెడ్డి, ఇండ్ల నాగరాజు, జానకి రాములు, ఇంజం రాం రెడ్డి, బండారు ప్రసాద్, అంజయ్య, సాంబయ్య, రమేష్, వంగాల విజయ్, కొట విజయ్, పాపయ్య, సైదులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రూ.లక్ష ఆర్థికసాయానికి దరఖాస్తు చేసుకోవాలి

మాడుగులపల్లి : మైనార్టీలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా వంద శాతం రాయితీతో అందిస్తున్న రూ.లక్ష ఆర్థిక సాయానికి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీపీ పోకల శ్రీవిద్యరాజు శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 15 వరకు దరఖాస్తుకు గడువు ఉందని, అర్హులైన క్రిస్టియన్ మైనార్టీలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

ఎమ్మెల్యేకు హోంగార్డుల కృతజ్ఞతలు

మిర్యాలగూడ అర్బన్: ఎన్నో సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్న హోంగార్డుల సమస్యలను స్థానిక ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అసెంబ్లీలో ప్రస్తావించడంపై స్థానిక హోంగార్డులు శనివారం అమరవీరుల స్థూపం వద్ద కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోలీస్ శాఖలో అనేక ఏళ్లుగా పని చేస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని ఎమ్మెల్యే అసెంబ్లీలో ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెల్లడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో హోంగార్డులు యాదగిరి, మరియన్న, నీల, స్వర్ణ, రాము, సైదులు, సరస్వతి తదితరులున్నారు.

ఓటరు జాబితాపై సమావేశం

నిడమనూరు : మండలంలోని వివిధ పార్టీ నాయకులతో తహసీల్దార్ ఎం శ్రీధర్ శనివారం సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాలో మార్పు చేర్పులు, గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల మార్పులకు సంబంధించి ఫిర్యాదుల ఉంటే ఫిర్యాదు చేయాలని కోరారు. ఓటర్లకు రెండు కిలోమీటర్లలోపు ఒక పోలింగ్ బూత్ ఉండేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. రెండు చోట్ల ఓటు హక్కు ఉన్నవారు స్వచ్ఛందంగా ఒక ఓటును తొలగించుకోవాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నుంచి విశ్వనాథుల రమేష్, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు మంద తిరుపతయ్య, గాయకవాడ లక్ష్మీనారాయణ, ఎలక్షన్ డీటీ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర్లుకు నివాళి

త్రిపురారం : మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లు వారం రోజుల కిందట గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో శనివారం త్రిపురారం గ్రామ పంచాయతీలో గ్రామ పాలక వర్గ సభ్యులు కార్యదర్శి వెంకటేశ్వర్లు మృతికి సంతాపం తెలుపుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో త్రిపురారం సర్పంచ్ అనుముల శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ పీబీ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి కొడిరెక్క రాజేంద్ర కుమార్, వార్డు సభ్యులు చింతకాయల యాదయ్య, కొల్లి రాము పాలవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : మండల కేంద్రానికి చెందిన కటికర్ల నర్సింహ అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మరణించాడు. విషయం తెలుసుకున్న బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి, తిరుమలగిరి గ్రామానికి చెందిన పగడాల సైదులు యాదవ్ వేర్వేరుగా మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆ కటుంబానికి పాండురంగారెడ్డి రూ.10వేలు, పగడాల సైదులు రూ.10వేలు అందజేశారు. వారి వెంట వైస్ ఎంపీపీ యడవల్లి దిలీప్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ శాగం శ్రవణ్ కుమార్‌రెడ్డి, సర్పంచులు పమ్మి జనార్ధన్‌రెడ్డి, సుంకిరెడ్డి ప్రభావతి సంజీవరెడ్డి, నాయకులు బుర్రి రాంరెడ్డి, ప్రసాద్, ప్రదీప్‌రెడ్డి, కరీం, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో డెంగీ నిర్ధారణ, మలేరియా పరీక్షలు

అడవిదేవులపల్లి : మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో నేటి నుంచి డెంగీ, మలేరియా పరీక్షలను నిర్వహించడం జరుగుతుందని డాక్టర్ ఉపేందర్ అన్నారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎం, ఆశలకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 7వ తేది నుంచి 12వ తేది వరకు నిర్వహించే మిషన్ ఇంద్ర ధనుష్ కార్యక్రమం కింద గర్భిణులకు, 5 ఏళ్లలోపు పిల్లలకు అన్ని రకాల వ్యాక్సిన్ ఉచితంగా వేయనున్నట్లు తెలిపారు. ఏమైన సమస్యలు ఉంటే వైద్యుల సలహాలను తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సత్యనారాయణరెడ్డి, బేబి, విజయ, మాధవి, యాదమ్మ, సునిత, సైదమ్మ తదితరలుఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో ఆయిల్, రాగి వైరు చోరీ

నిడమనూరు: గుర్తుతెలియని వ్యక్తులు నిడమనూరు మండలంలోని రాజన్నగూడెంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగుల గొట్టి అందులోని ఆయిల్, రాగి వైర్లను చోరీ చేశారు. రైతులు కాట్నం యాదగిరి, బత్తుల అశోక్‌లకు చెందిన రెండు 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లను పగుల గొట్టి అందులోంచి రూ.8వేల విలువైన ఆయిల్, రాగి వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి దొంగిలించినట్లు పోలీసులకు, విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేశారు.